క్లుప్తంగా

పాన్‌గల్ తహసీల్దార్‌గా సుభాష్‌నాయుడు



పాన్‌గల్: మండల నూతన తహసీల్దార్‌గా సుభాష్‌నాయుడు గురువారం బాధ్యతలు స్వీకరించారు. ఇక్కడ విధులు నిర్వహిస్తున్న రాంబాయి జిల్లా కేంద్రంలోని ఆర్డీఓ కార్యాలయం ఏఓగా బదిలీ కావడంతో జోగులాంబ గద్వాల జిల్లా నుంచి పాన్‌గల్ మండల తహసీల్దార్‌గా నియమించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కార్యాలయం సిబ్బంది తోడ్పాటు, మండల ప్రజాప్రతినిధుల సహకారంతో ప్రజలకు అందుబాటులో ఉంటూ మండల అభివృద్ధికి కృషి చేస్తానన్నారు.

యాత్రను విజయవంతం చేయాలి



పెబ్బేరు రూరల్: బీజేపీ ఆధ్వర్యంలో కొనసాగుతున్న విజయ సంకల్పయాత్ర ఈ నెల 25న పెబ్బేరు పట్టణానికి విచ్చేస్తున్న సందర్భంగా యాత్రలో అన్ని గ్రామాల నుంచి కార్యకర్తలు, ప్రజలు అధిక సంఖ్యలో పాల్గొని కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని బీజేపీ వనపర్తి జిల్లా అధ్యక్షుడు నారాయణ కోరారు. ఆయన గురువారం మండల కేంద్రంలో నిర్వహించిన బీజేపీ సమావేశంలో ముఖ్య అతిథిగా పాల్గొని మాట్లాడారు. అనంతరం మండల అధ్యక్షుడు నారాయణ ఆధ్వర్యంలో మండలానికి మొదటిసారిగా విచ్చేసిన జిల్లా అధ్యక్షుడికి శాలువాతో సన్మానించారు. కార్యక్రమంలో అసెంబ్లీ కన్వీనర్ శ్రీనివాస్‌గౌడ్, ఓబీసీ మోర్చా జిల్లా అధ్యక్షుడు రాఘవేందర్‌గౌడ్, కిసాన్ మోర్చా జిల్లా ప్రధాన కార్యదర్శి వెంకట్రామిరెడ్డి, నాయకులు క్రాంతి, నరసింహానాయుడు, గోవిందు, శివ తదితరులు పాల్గొన్నారు.

ఉద్యోగరిత్యా బదిలీలు సహజం



అమరచింత: ప్రభుత్వ ఉద్యోగులకు ఉద్యోగరీత్యా బదిలీలు సహజమని వైస్ ఎంపీపీ బాల్‌రెడ్డి అన్నారు. ఎంపీడీఓ కార్యాలలయంలో విధులు నిర్వహించి బదిలీపై వెళ్తున్న ఎంపీడీఓ జ్యోతిపరుషియ ను ఆయన శాలువా, పూలమాలతో ఘనంగా సత్కరించారు. అదే విధంగా నూతనంగా ఎంపీడీఓ బాధ్యతలు స్వీకరించిన శ్రీనివాస్‌కు స్వాగతం పలికారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ అధికారులు గ్రామాల అభివృద్ధిలో భాగస్వాములు కావాలన్నారు. గతంలో ఎంపీడీఓగా విధులు నిర్వహించి బదిలీపై వెళ్తున్న ఎంపీడీఓ జ్యోతిపరుషియ సేవలను మండల ప్రజలు మరువరన్నారు. వేసవిని దృష్టిలో ఉంచుకుని గ్రామాల్లో తాగునీటి ఎద్దడి రాకుండా చర్యలు తీసుకోవాలని కోరారు. కార్యక్రమంలో రైతు సమితి మండల అధ్యక్షుడు చుక్క ఆశిరెడ్డి, ఎంపీఓ నరసింహులు, పంచాయతీ కార్యదర్శులు, ఈజీఎస్ సిబ్బంది పాల్గొన్నారు.

పల్స్‌పోలియోపై అవగాహన



పెబ్బేరు రూరల్: పెబ్బేరు ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో గురువారం పల్స్ పోలీయోపై మండల వైద్య అధికారి రాముడు ఆశావర్కర్లు, ఏఎన్‌ఎంలకు, సూపర్‌వైజర్లు, అంగన్‌వాడీ టీచర్లకు అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మార్చి 3, 4, 5 తేదీలో జరిగే పల్స్‌పోలీయో కార్యక్రమాన్ని విజవంతం చేయాలని వారికి సూచించారు. ఐదేళ్లలోపు పిల్లలందరికీ పోలీయో చుక్కలు వేసి వారిని సంపూర్ణ ఆరోగ్యవంతులుగా మార్చాలని సూచించారు.

ఆర్థికసాయం అందజేత



పెబ్బేరు రూరల్: పట్టణానికి చెందిన మాందాపురం అలివేలమ్మ రెండు రోజుల క్రితం అనారోగ్యంతో మృతి చెందింది. స్థానిక కాంగ్రెస్ నాయకులు విషయాన్ని ఎమ్మెల్యే మేఘారెడ్డి దృష్టికి తీసుకెళ్లడంతో స్పందించిన ఆయన రూ.5 వేలు పంపించారు. కాంగ్రెస్ పట్టణ అధ్యక్షుడు వెంకట్‌రాములు, నాయకులు గంధం రాజశేఖర్, రంజిత్‌కుమార్, సునీల్‌కుమార్, జగదీశ్వర్‌రెడ్డి, యుగేంధర్‌రెడ్డి, అశ్విని, సత్యనారాయణ గురువారం బాధిత కుటుంబ సభ్యులను పరామర్శించి ఆర్థికసాయం అందించారు.

కనులపండువగా కల్యాణోత్సవం



తూంపల్లిలో పూజలు చేస్తున్న ఎమ్మెల్యే వాకిటి శ్రీహరి దంపతులు



గట్టుకాడిపల్లిలో పట్టు వస్త్రాలు సమర్పిస్తున్న ఎమ్మెల్యే మేఘారెడ్డి దంపతులు

- గట్టుకాడిపల్లిలో లక్ష్మీవేంకటేశ్వరస్వామి ఉత్సవాలు
- పట్టువస్త్రాలు సమర్పించిన ఎమ్మెల్యే తూడి మేఘారెడ్డి దంపతులు

ఖిల్లాఘనపురం: మండలంలోని గట్టుకాడిపల్లి (అంజనగిరి) శ్రీలక్ష్మిఅలవేలుమంగ సమేత వేంకటేశ్వర స్వామి కల్యాణ మహోత్సవాన్ని గురువారం పండితులు వేదమంత్రోచ్చరణల నడుమ కమనీయంగా నిర్వహించారు. రెండు రోజులుగా దేవాలయంలో స్వామివారికి క్షీరాభిషేకం, ధ్వజారోహణ, గరుడ సేవ తదితర ప్రత్యేక పూజలు చేశారు. గురువారం ఉదయం నుంచి ప్రత్యేక పూజలు చేపట్టిన ఆలయ కమిటీ వారు 10 గంటల నుంచి స్వామి వారి కల్యాణ మహోత్సవం ప్రారంభించారు. వనపర్తి ఎమ్మెల్యే తూడి మేఘారెడ్డి, శారద దంపతులు స్వామివారికి పట్టువస్త్రాలు సమర్పించారు. జిల్లా నలుమూలల నుంచి పెద్ద సంఖ్యలో భక్తులు తరలి వచ్చి స్వామివారి దర్శనం చేసుకున్నారు. స్వామి వారి హస్తాలకు తాకించిన మంగళసూత్రాలను శ్రీలక్ష్మీ అలవేలుమంగలకు బ్రాహ్మణులు కట్టారు. కల్యాణోత్సవం సందర్భంగా స్వామివార్లను ఆభరణాలు, పూలమాలలతో అందంగా అలంకరించారు. భక్తులు స్వామి వారికి పెళ్లి బట్టలు తెచ్చారు. ఉత్సవాల్లో భాగంగా దాతలు దేవాలయం ఆవరణలో అన్నదాన కార్యక్రమం ఏర్పాటు చేశారు. మండలంలోని వివిధ గ్రామాలకు చెందిన ప్రజా ప్రతినిధులు, నాయకులు తదితరులు పూజా కార్యక్రమాల్లో పాల్గొని తరించారు.

భక్తిశ్రద్ధలతో ప్రతిష్ట మహోత్సవం

ఆత్మకూర్: మండలంలోని తూంపల్లిలో శివపంచాయతన, ఆదిత్యాది నవగ్రహ, శిఖర, ధ్వజ గ్రామ నాభిశిల, బొడ్రాళ్ల ప్రతిష్ట మహోత్సవాన్ని గురువారం భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. గురువారం ఉదయం 7 గంటలకు శ్రీమహాగణపతి పూజతో కార్యక్రమాలు ప్రముఖ వేదపండితుల ఆధ్వర్యంలో ప్రారంభమయ్యాయి. మక్తల్ ఎమ్మెల్యే వాకిటి శ్రీహరి, వాకిటి లలిత దంపతులు, రాష్ట్ర గీతకార్మిక డిపార్ట్‌మెంట్ చైర్మన్ కేషం నాగరాజుగౌడ్, లక్ష్మారెడ్డి, గడ్డంపల్లి హన్మంతు, చంద్రకాంత్‌గౌడ్, లక్ష్మీకాంత్ రెడ్డి ప్రత్యేక పూజల్లో పాల్గొన్నారు. ప్రతిష్ట మహోత్సవం అనంతరం భక్తులకు తీర్థ, అన్నదాన ప్రసాదం అందించారు. కార్యక్రమంలో నిర్వాహకులు మహేశ్వర్‌రెడ్డి, బాలకృష్ణారెడ్డి, మొగిలన్న, రాములు, మాధవరెడ్డి, రవీందర్‌రెడ్డి, హర్షవర్ధన్ రెడ్డి, అయ్యూబ్‌ఖాన్, రహ్మతుల్లా, గడ్డంశ్రీను, అజ్మత్, సాయిరాఘవ, భక్తులు పాల్గొన్నారు.

వైభవంగా పూజలు



కొత్తకోట రూరల్: పట్టణ సమీపంలో గల శ్రీలక్ష్మీ వేంకటేశ్వరస్వామివారి బ్రహోత్సవాల్లో భాగంగా గురువారం స్వామివారి కల్యాణోత్సవం అంగరంగ వైభవంగా నిర్వహించారు. భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొని స్వామి వారి కల్యాణోత్సవాన్ని తిలకించారు. అనంతరం భక్తుల మొక్కులు తీర్చుకున్నారు. ఆలయ నిర్వాహకులు భక్తులకు అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. అంతకు ముందు ఎమ్మెల్యే జి.మధుసూదన్‌రెడ్డి దంపతులు, మాజీ ఎమ్మెల్యే రావుల రవీంద్రనాథ్‌రెడ్డి దంపతులు స్వామి వారి కల్యాణోత్సవంలో పాల్గొన్నారు. 24న రథోత్సవం ఉంటుందని, భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొని స్వామి వారి కార్యక్రమాలను తిలకించి తమ మొక్కులు తీర్చుకోవాలని ఆలయ నిర్వహకులు కోరారు.

‘హామీలను తప్పక నెరవేర్చుతాం’

కొత్తకోట రూరల్: ఎన్నికల ముందు కాంగ్రెస్ పార్టీ ఇచ్చిన హామీలను తప్పకుండా నెరవేర్చేందుకు కట్టుబడి ఉన్నామని, విడత వారీగా పథకాల అమలుకు కృషి చేస్తున్నామని దేవరకద్ర ఎమ్మెల్యే మధుసూదన్‌రెడ్డి అన్నారు. గురువారం మండలంలోని కానాయపల్లి, సంకిరెడ్డిపల్లి, రాయిణిపేట, వడ్డెవాట గ్రామాల్లో సీసీ రోడ్లతో పాటు పలు అభివృద్ధి పనులకు శంఖుస్థాపన చేశారు. ఈ సందర్భంగా సంకిరెడ్డిపల్లిలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ఎమ్మెల్యే మాట్లాడుతూ పేదలను గుర్తించి వారికి కావాల్సిన సంక్షేమ పథకాలను అమలు చేసేందుకు ప్రజాపాలన కార్యక్రమం చేపట్టామన్నారు. గడిచిన తొమ్మిదేళ్లలో గత పాలకులు అభివృద్ధిని మర్చారని, సీఎం రేవంత్‌రెడ్డి నాయకత్వంలో అభివృద్ధి, సంక్షేమమే లక్ష్యంగా ముందుకు వెళ్తున్నామని పేర్కొన్నారు. అంతకు ముందు కానాయపల్లి శివారులో గల వెంకటగిరి ఆలయంలో జరుగుతున్న స్వామివారి కల్యాణోత్సవంలో ఎమ్మెల్యే పాల్గొని పూజలు చేశారు. ఎమ్మెల్యే రాక సందర్భంగా ఆలయ నిర్వాహకులు ఘనస్వాగతం పలికారు. రాయిణిపేట గ్రామానికి ఆర్టీసీ బస్సును ప్రారంభించారు. కార్యక్రమంలో ఎస్సీసెల్ రాష్ట్ర ఉపాధ్యక్షులు పి.ప్రశాంత్, ఎన్‌ఆర్‌ఐ అమర్‌రెడ్డి, బోయేజ్, పి.కృష్ణారెడ్డి, శ్రీనివాస్‌రెడ్డి, మేస్త్రీ శ్రీనివాసులు, డాక్టర్ పీజే బాబు, ఎల్లంపల్లి నరేందర్‌రెడ్డి, శేఖర్‌రెడ్డి, వెంకట్రామిరెడ్డి, భాస్కర్‌రెడ్డి, బీచుపల్లియాదవ్, ముస్తఫా, మన్యం తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న ఎమ్మెల్యే జి.మధుసూదన్‌రెడ్డి

అమ్మవారి వెండి చీరకు విరాళం



కొత్తకోట రూరల్: పట్టణ కేంద్రంలోని కన్యకాపరమేశ్వరి ఆలయంలో అమ్మవార్లకు వెండి చీరల తయారీ కోసం చేపట్టిన విరాళాల సేకరణ కార్యక్రమంలో భాగంగా పట్టణ కేంద్రానికి చెందిన ప్రముఖ వ్యాపారి విశ్వనాథం వెంకటరమణ దంపతులు కిలో వెండికి సరిపడా డబ్బులను (రూ.75వేలు) ఆర్యవైశ్య మహిళా విభాగం నాయకురాలు, కొత్తకోట ఎంపీపీ గుంత మౌనికకు విరాళంగా అందజేశారు. ఆలయంలో జరుగుతున్న పుణ్య కార్యక్రమానికి ఆర్యవైశ్యులు ముందుకురావాలని ఎంపీపీ కోరారు. అదేవిధంగా బీమా సత్యనారాయణ దంపతులు, కండె సురేష్ దంపతులు విరాళాలు అందజేసినట్లు ఎంపీపీ తెలిపారు.

విద్యార్థుల సామర్థ్యాలు పెంచేలా బోధన

పాన్‌గల్: వెనుకబడిన విద్యార్థులపై ప్రత్యేక దృష్టి సారించి వారి సామర్థ్యాలు పెంచేలా బోధన సాగాలని ఎంఈఓ లక్ష్మణ్‌నాయక్ అన్నారు. గురువారం మండలంలోని బుసిరెడ్డిపల్లి, కేతేపల్లి ప్రాథమిక పాఠశాలలను ఆయన సందర్శించారు. ఈ సందర్భంగా విద్యార్థులు, ఉపాధ్యాయుల హాజరు శాతం, విద్యార్థుల సామర్థ్యాలు, మధ్యాహ్న భోజనం పరిశీలించారు. తెలుగు, గణితం, ఇంగ్లిష్ సబ్జెక్టులపై తరగతుల వారీగా సామర్థ్యాలను పరిశీలించగా విద్యార్థులు చక్కగా సామాధానాలను చెప్పడంతో ఆయన సంతృప్తి వ్యక్తం చేశారు. మధ్యాహ్న భోజనం మెనూ ప్రకారం నాణ్యతగా అందించాలన్నారు.

తాగునీటిపై ప్రత్యేక దృష్టి

వేసవి కాలం దృష్ట్యా తాగునీటి ఎద్దడి రాకుండా ముందస్తు చర్యలు తీసుకోవాలని జీపీ ప్రత్యేక అధికారి లక్ష్మణ్‌నాయక్ అన్నారు. తాగునీటి పైపు లైన్ల మైనర్ మరమ్మతు ఏమైనా ఉంటే కాలనీల్లో పరిశీలించి పూర్తి చేయాలన్నారు. ఉపాధి పనులకు వచ్చే కూలీల సంఖ్యను పెంచాలని, పనుల వద్ద అన్ని వసతులు కల్పించాలన్నారు.



విద్యార్థుల సామర్థ్యాలను పరిశీలిస్తున్న ఎంఈఓ లక్ష్మణ్‌నాయక్

వారాంతపు సంతలో సౌకర్యాలు కరువు



రోడ్డుపైనే కొనసాగుతున్న సంత

అమరచింత: మున్సిపల్ కేంద్రంలో ప్రతి గురువారం జరిగే వారాంతపు సంత బజారులో కనీస సౌకర్యాలను మున్సిపల్ అధికారులు కల్పించడం లేదు. సంతలో తమ వస్తువులు, కూరగాయలు అమ్ముకునేందుకు వస్తున్న చిరు వ్యాపారులు, రైతులతో ముక్కు పిండి తైబజారు డబ్బులను వసూళ్లు చేసుకుంటున్నారే తప్పా.. వారికి కనీసం తాగునీటి వసతిని సైతం కల్పించలేక పోతున్నారని వారు ఆరోపిస్తున్నారు. సంత బజారుకు ప్రత్యేకమైన స్థలాన్ని నిర్దేశించక పోవడంతో ప్రధాన రహదారిపైనే విక్రయాలు జరుపుకొనే పరిస్థితులు దాపరించాయి. దీంతో వాహన రాకపోకలకు తీవ్ర ఇబ్బందులు కలుగుతూ ప్రమాదాలు చోటుచేసుకునే దుస్థితి దాపరించింది. ఇప్పటికైనా వారాంతపు సంత నిర్వహణపై మున్సిపల్ పాలక వర్గం దృష్టి సారించాలని కోరుతున్నారు.

కాంగ్రెస్ పార్టీ బలోపేతానికి కృషి



కొత్తకోట రూరల్: ఐఎన్‌టీయూసీ మహిళా విభాగం వనపర్తి జిల్లా అధ్యక్షురాలిగా పెద్దమందడి మండలంలోని బలిజపల్లికి చెందిన సీనియర్ కాంగ్రెస్ నాయకురాలు కె.గిరిజా దేవిని నియమిస్తూ ఐఎన్‌టీయూసీ రాష్ట్ర అధ్యక్షుడు డాక్టర్ మురహరి హైదరాబాద్‌లో నియామకపత్రం అందజేశారు. 10ఏళ్లుగా కాంగ్రెస్‌లో చురుకుగా పనిచేసిన గిరిజాదేవి భవిష్యత్‌లో పార్టీ బలోపేతానికి కృషి చేస్తుందని మురహరి ఆకాంక్షించారు. తనపై నమ్మకం ఉంచి జిల్లా బాధ్యతలు అప్పగించిన జిల్లా, రాష్ట్ర నాయకులకు ఆమె కృతజ్ఞతలు తెలిపారు. కాంగ్రెస్ పార్టీపై మహిళలకు నమ్మకం కలిగేందుకు కృషి చేస్తానన్నారు. కార్యక్రమంలో సుదర్శన్, శరణ్యారెడ్డి, నర్మదారెడ్డి, మాధవరెడ్డి తదితరులు ఉన్నారు.

పుస్తె, మెట్టెలు బహూకరణ

మదనాపురం: మండలంలోని రామన్‌పాడులో గురువారం తెలుగు చింతలన్న కుమార్తె వివాహం జరిగింది. గ్రామానికి చెందిన చాపల రఘునాథ్‌రెడ్డి, చాపల సువర్ణ దంపతులు తమ సొంత డబ్బులతో పెళ్లికూతురికి పుస్తె, మెట్టెలు చేయించి బహూకరించారు. కార్యక్రమంలో చాపల శ్రీధర్‌రెడ్డి, పాషా, కురుమన్న, మాసన్న, వెంకటేష్, పాల్గొన్నారు.

శాస్త్రీయ విద్యతోనే వికాసం

వనపర్తి టౌన్: శాస్త్రీయ విద్యా విధానంతోనే విద్యార్థుల్లో విజ్ఞానం వికసిస్తుందని సాహితీ కళావేదిక జిల్లా అధ్యక్షుడు పలుస శంకర్‌గౌడ్, డీఈఓ గోవిందరాజు పేర్కొన్నారు. విద్యను నిర్లక్ష్యం చేయకుండా అక్షర జ్ఞానం పెంపొందించేందుకు కృషి చేస్తే జీవితంలో అత్యున్నత శిఖరాలను చేరుకోవచ్చన్నారు. బుధవారం రాత్రి రేడియంట్ హై స్కూల్ 18వ వార్షికోత్సవానికి వారు ముఖ్య అతిథులుగా హాజరై మాట్లాడారు. విద్యార్థులు గుణాత్మక విద్యను అందిపుచ్చుకోవాలని సూచించారు. విద్యార్థులు 10 ఫలితాల్లో మెరుగైన ఉత్తీర్ణత సాధించేందుకు తల్లిదండ్రుల పాత్ర కీలకంగా కావాలని ఆకాంక్షించారు. అనంతరం విద్యార్థులు చేసిన నృత్యాలు ఆకట్టుకున్నాయి.

సగరుల అభ్యున్నతికి కృషి

ఖిల్లాఘనపురం: మండల సగర (ఉప్పర) నూతన కమిటీని గురువారం ఏకగ్రీవంగా ఎన్నుకున్నట్లు కమిటీ గౌరవ సలహాదారు మోడల రామాంజనేయులు తెలిపారు. మండల కేంద్రంలో వివిధ గ్రామాలకు చెందిన సగరులు గురువారం సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మండల నూతన కమిటీని ఎన్నుకోగా.. అధ్యక్షుడిగా చిలుక పర్వతాలు, ఉపాధ్యక్షులు దేశెట్టి జనార్దన్, చిలుక శ్రీనువాసులు, ప్రధాన కార్యదర్శి గుంటి రాములు, కోశాధికారిగా చిలుక కృష్ణయ్య, కార్యదర్శులుగా చిలుక యాదయ్య, మోడల మల్లేష్, కృష్ణసాగర్, అశోక్, సలహాదారులుగా చిలుక పుల్లయ్య, గడ్డపార వెంకటయ్య, మోడల రామాంజనేయులు, భరత్ సాగర్, మోడల కృష్ణయ్య ను నియమించారు. సగరుల అభ్యున్నతికి కృషి చేస్తామని నూతన అధ్యక్షుడు తెలిపారు.

ఘనంగా స్వయం పరిపాలన దినోత్సవం

పెబ్బేరు రూరల్: ఉమ్మడి మండలంలోని పెబ్బేరు, నాగసానిపల్లి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో గురువారం స్వయం పరిపాలన దినోత్సవం ఘనంగా నిర్వహించుకున్నారు. ఉపాధ్యాయులుగా మారిన విద్యార్థుల నైపుణ్యాలు ప్రదర్శించి, తోటి విద్యార్థులకు విద్యాబోధన చేశారు. కార్యక్రమంలో హెచ్‌ఎంలు విష్ణువర్ధన్‌రావు, శ్రీనివాసులు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.



ఉపాధ్యాయులైన విద్యార్థులు

మొక్కల సంరక్షణ అందరి బాధ్యత



ఫీడర్ చానల్ పనులను పరిశీలిస్తున్న ఎంపీడీఓ

పెబ్బేరు రూరల్: హరితహారంలో నాటిన మొక్కల సంరక్షణ అందరి బాధ్యత అని ఎంపీడీఓ రవీందర్ అన్నారు. గురువారం శ్రీరంగాపురం మండలంలోని తాటిపాములలో నర్సరీని, ఫీడర్ చానల్‌లో జరుగుతున్న పనులు, రోడ్డు వెంబడి నాటిన మొక్కలను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నాటిన మొక్కలకు రోజు నీరందించి కాపాడాలని సిబ్బందిని ఆదేశించారు. మొక్కల చుట్టూ పిచ్చి మొక్కలు లేకుండా చూడాలని సూచించారు. కార్యక్రమంలో ఎంపీఓ రాజు, ఏపీఓ ఘట్టయ్య, కార్యదర్శి, టీఏ, ఎఫ్‌ఏ పాల్గొన్నారు.

మొక్కల పెంపకంపై ప్రత్యేక దృష్టి

పాన్‌గల్: వేసవి కాలం దృష్ట్యా నర్సరీల్లో పెంచుతున్న మొక్కలపై ప్రత్యేక దృష్టి సారించి వాటికి క్రమం తప్పకుండా నీరు పట్టాలని ఎంపీడీఓ కోటేశ్వర్ అన్నారు. గురువారం మండలంలోని అన్నారంతండాలో నర్సరీ, ఉపాధి పనులను ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నర్సరీ మొక్కలతో పాటు హరితహారంలో రోడ్డుకు ఇరువైపులా నాటిన మొక్కలకు క్రమం తప్పకుండా నీరు పట్టాలన్నారు. గ్రామంలో తాగునీటి ఎద్దడి రాకుండా ముందస్తు చర్యలు, పన్నుల వసూళ్లు చేయాలని కార్యదర్శులను ఆదేశించారు. విధుల్లో అలసత్వం వహించే సిబ్బందిపై చర్యలు తప్పవని హెచ్చరించారు. ఉపాధి కూలీల సంఖ్యను పెంచి గ్రామంలో అర్హులందరికీ ఉపాధి అవకాశాలు కల్పించాలని సూచించారు. కార్యక్రమంలో ఎంపీఓ రఘురాములు, పంచాయితీ కార్యదర్శి, ఉపాధి సిబ్బంది పాల్గొన్నారు.



అన్నారంతండాలో నర్సరీలో మొక్కలను పరిశీలిస్తున్న ఎంపీడీఓ కోటేశ్వర్

అదృశ్యమైన బాలికల ఆచూకీ లభ్యం



మాట్లాడుతున్న సీఐ నాగభూషణం

పెబ్బేరు రూరల్: వనపర్తి పట్టణంలో మంగళవారం కనిపించకుండా పోయిన బాలికల ఆచూకీ మంత్రాలయంలో లభ్యమయిందని సీఐ నాగభూషణం తెలిపారు. గురువారం వనపర్తిలో ఏర్పాటు చేసిన విలేకర్ల సమావేశంలో సీఐ నాగభూషణం, టౌన్ ఎస్ఐ జయన్న మాట్లాడుతూ వివరాలు వెల్లడించారు. పాత బజారుకు చెందిన పావని, పాతకోటకు చెందిన మౌనిక ఈ నెల 20న కనిపించడం లేదని అమ్మాయిల తల్లిదండ్రుల ఫిర్యాదుతో పోలీసులు కేసు నమోదు చేశారు. ఎస్పీ రక్షిత కే మూర్తి ఆదేశాల మేరకు వనపర్తి సీఐ నాగభూషణం ఆధ్వర్యంలో టౌన్ ఎస్ఐ జయన్న, రూరల్ ఎస్ఐ జలంధర్ రెడ్డి, పాన్‌గల్ ఎస్ఐ వేణు, గోపాల్‌పేట ఎస్ఐ హరిప్రసాద్‌లను నాలుగు బృందాలుగా ఏర్పాటు చేసి దర్యాప్తుకు ఆదేశించారు.

మంత్రాలయానికి ప్రయాణం

వనపర్తిలో సీసీ పుటేజీలను పరిశీలించగా బాలికలు ఇంటి నుంచి బయలుదేరి ఆర్టీసీ బస్టాండులో కర్నూల్ బస్సు ఎక్కారు. జోగులాంబ గద్వాల జిల్లా ఎర్రవల్లి వద్ద బస్సు దిగి, అక్కడి నుంచి బీచుపల్లికి చేరుకుని ఆంజనేయస్వామిని దర్శించుకున్నారు. అక్కడి నుంచి బస్సులో గద్వాలకు, అనంతరం మంత్రాలయానికి చేరుకున్నారు. వనపర్తి సీఐ మంత్రాలయం ఎస్ఐకి సమాచారం అందించారు. దీంతో రంగంలోకి దిగిన వారు ఇద్దరు బాలికలను గుర్తించి, వారిని విచారించగా వనపర్తి జిల్లాకు చెందినవారమని చెప్పడంతో పోలీసులు పోలీస్‌స్టేషన్‌కు తీసుకొచ్చారు. దీంతో స్థానిక ఎస్ఐ జయన్న మంత్రాలయం వెళ్లి ఇద్దరి బాలికలను వనపర్తికి తీసుకొచ్చారు. అనంతరంబాలికలకు, తల్లి దండ్రులకు కౌన్సెలింగ్ ఇచ్చి వారిని తల్లితండ్రుల కు అప్పగించారు. ఈ కేసు త్వరగా ఛేదించిన వనపర్తి సీఐ, ఎస్ఐలను ఎస్పీ, డీఎస్పీ అభినందించారు.

మౌలానా ఆజాద్‌కు ఘన నివాళి

వనపర్తి టౌన్: మహాత్మాగాంధీ, బీఆర్ అంబేడ్కర్‌తో కలిసి స్వాతంత్ర్య ఉద్యమాల్లో పాల్గొంటూనే నిమ్న కులాల హక్కుల సాధనకు పరితపించిన మౌలానా ఆజాద్ సేవలు మరువలేనివని ప్రజావాగ్గేయకారుడు రాజారామ్‌ప్రకాశ్ అన్నారు. గురువారం మౌలానా అబుల్ కలాం ఆజాద్ వర్ధంతిని పురస్కరించుకొని టీజేఏసీ ఆధ్వర్యంలో జిల్లా కేంద్రంలోని పాలిటెక్నిక్ కళాశాల ఆవరణలో ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. కౌన్సిలర్లు నాగన్న, భాషానాయక్, కవి డాక్టర్ నాయకంటి నరసింహాశర్మ, దేవన్ననాయుడు, నాగరాజు, బాలేమియా, పరమేశ్వరచారి, మాధవచారి పాల్గొన్నారు.

పెబ్బేరు రూరల్: పట్టణంలోని సుభాష్ చౌరస్తాలో ఎంఐఎం పార్టీ ఆధ్వర్యంలో మౌలానా అబుల్ కలాం ఆజాద్ చిత్రపటానికి నివాళులర్పించారు. కార్యక్రమంలో మండల అధ్యక్షుడు ఎండీ అఫ్రోజ్, ఉపాధ్యక్షుడు జాకీర్, ప్రధాన కార్యదర్శి ఆరీఫ్, మస్తాన్, అమీర్, సమీర్, ఇమ్రాన్, ఇర్ఫాన్, హాజీ తదితరులు పాల్గొన్నారు.



వనపర్తిలో ఆజాద్ చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న నాయకులు

మహిళలు ఆర్థిక స్వావలంబన సాధించాలి



మాట్లాడుతున్న డీపీఎం అరుణ

ఆత్మకూర్: స్వయం సహాయక సంఘాల సభ్యులు ఆర్థికంగా రాణించేందుకు ప్రవేశపెట్టిన లక్‌పతి దీదీని సద్వినియోగం చేసుకోవాలని డీపీఎం అరుణ, ఏపీఎంలు కృష్ణవేణి, శ్రీనివాసులు, వెంకటేష్ అన్నారు. గురువారం మండల మహిళా సమాఖ్య భవనంలో రెండో రోజు ఆత్మకూర్, అమరచింత మండలాల స్వయంసహాయక సభ్యులకు, వీఓఏలకు లక్‌పతి దీదీ కార్యక్రమంపై అవగాహన కల్పించారు. నిరుపేద మహిళా సభ్యులను గుర్తించి జీవనోపాధికోసం రూ. 5 లక్షలు వడ్డీలేని రుణాలు ఇవ్వనున్నారని వివరించారు. కార్యక్రమంలో సీసీలు ఆంజనేయులు, అన్వర్, తిరుపతమ్మ, బీసన్న, వీఓఏలు, మహిళా సమాఖ్య సభ్యులు ఉన్నారు.

పరిసరాల శుభ్రత అందరి బాధ్యత

ఆత్మకూర్: వ్యక్తిగత, పరిసరాల పరిశుభ్రతతోనే సంపూర్ణ ఆరోగ్యం సాధ్యమని, ఈవిషయంలో ప్రతి ఒక్కరూ బాధ్యతగా వ్యవహరించాలని చైర్‌పర్సన్ గాయత్రిరవియాదవ్, వైస్‌చైర్మన్ విజయభాస్కర్‌రెడ్డి, కమిషనర్ నాగరాజు అన్నారు. గురువారం మున్సిపాలిటీ పరిధిలోని ఆరో వార్డులో పర్యటించి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. తాగునీటి సరఫరా, పారిశుద్ధ్యం విషయంలో సిబ్బంది అప్రమత్తంగా ఉండాలని సూచించారు. పన్నులను సకాలంలో చెల్లించి అభివృద్ధిలో భాగస్వామ్యం కావాలని కోరారు. కార్యక్రమంలో కౌన్సిలర్ యాదమ్మ, గద్దమీది శ్రీనివాస్, మున్సిపల్ సిబ్బంది ఉన్నారు.



వార్డుల్లో పర్యటిస్తున్న చైర్‌పర్సన్ గాయత్రి

వ్యక్తిగత సమాచారం షేర్ చేయొద్దు



అవగాహన కల్పిస్తున్న ఎస్ఐ అంజాద్

వనపర్తి: వ్యక్తిగత సమాచారాన్ని షేర్ చేయటం వల్లనే.. సైబర్ నేరగాళ్లు పెరుగుతున్నాయని అక్రమ మానవ రవాణా నిరోధక విభాగం ఎస్ఐ అంజాద్ అన్నారు. ఎస్పీ రక్షితా కే మూర్తి సూచన మేరకు జిల్లా కేంద్రంలోని కృష్ణవేణి టాలెంట్ స్కూల్‌లో సైబర్ నేరాలు, ఈవ్ టీజింగ్, మహిళలు, చిన్నారులపై దాడుల విషయమై నిర్వహించిన అవగాహన కార్యక్రమంలో ఆయన పాల్గొని మాట్లాడారు. కొందరు సామాజిక మాధ్యమాలను అనవసరమైన విషయాలను ఎక్కువగా ప్రచారం చేస్తూ.. సమాజం తప్పుదోవ పట్టేందుకు కారకులవుతున్నారని ఆందోళన వ్యక్తం చేశారు. ఈ విషయంలో పోలీస్ నిఘా ఉంటుందని గమనించాలన్నారు. హద్దుమీరి సోషియల్ మీడియాలో పోస్టులు చేయరాదని సూచించారు.

చర్యలు తప్పవు

సోషియల్ మీడియాలో ఫేక్ మేసేజీలు పోస్టు చేస్తే చర్యలు తప్పని ఎస్ఐ స్పష్టం చేశారు. ప్రజలెవ్వరూ చట్టాన్ని చేతుల్లోకి తీసుకోరాదని, అనుమానాస్పదంగా కొత్తవారు కాలనీల్లో కనిపిస్తే పోలీసులకు సమాచారం ఇవ్వాలని కోరారు. బాల్య వివాహాలు, బాల, సరిహద్దు కార్మికుల విషయంలో ఏదైనా సమాచారం ఉంటే పోలీసులకు తెలియజేయాలని కోరారు.